రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌కు భైంసా జట్టు ఎంపిక

భైంసా, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ఫుట్‌బాల్ జట్టు సీఎం కప్ - 2024 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 30న హైదరాబాద్‌లోని హమీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో భైంసా జట్టు పాల్గొననుంది. జిల్లాస్థాయి పోటీల్లో భైంసా ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన భైంసా జట్టు సభ్యులను అభినందించి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.

రక్తహీనత లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

• జిల్లా వైద్యాధికారి రాజేందర్

సారంగాపూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులను గుర్తించి కాపాడేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో గల చించోలి (బీ) ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో హెచ్‌బీ పరీక్షల మాక్ డ్రిల్స్ రక్తహీనత పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాక్ డ్రిల్స్ కార్యక్రమం విజయవంతం అయితే జిల్లావ్యాప్తంగా ప్రతీఒక్కరికి రక్తహీనత పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికను తయారు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రక్తహీనత పరీక్ష పరికరాలు, స్ట్రిప్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గతంలో గర్భిణీలకు మాత్రమే రక్తహీనత పరీక్షలు నిర్వహించేదని, ప్రస్తుతం దీన్ని ఒక ఉద్యమంగా తీసుకొని జిల్లాను రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయనవెంట జిల్లా మాస్ మీడియా అధికారి బారె రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్ గౌడ్, మోహిన్ అలీ, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

అప్పుల వేధింపులు భరించలేక యువకుడి ఆత్మహత్య

• నలుగురిపై కేసు నమోదు

నిర్మల్‌అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చాలని కొందరు వ్యక్తులు చేసిన వేధింపులు భరించలేక పట్టణానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడి ఆత్మహత్యకు కారకులైన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ పట్టణంలోని నాయుడివాడకు చెందిన వంశీకృష్ణ (30) ఓ మెడికల్ ఏజెన్సీ నుంచి తన మందుల దుకాణం కోసం కొంత మొత్తంలో ఉద్దెరగా మందులు కొనుగోలుచేశాడు. ఇందులో నుంచి కొంత మొత్తం చెల్లించినప్పటికీ మరికొంత బాకీగా పడ్డాడు. దీంతో వంశీకృష్ణపై మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న నలుగురు యువకులు బాకీ చెల్లించాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తూ వేధింపులకు గురిచేశారు. దీన్ని భరించలేక వంశీకృష్ణ నిద్రమాత్రలు మింగాడు. దీంతో ఆయన అపస్మారిక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆయనను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వంశీకృష్ణ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తల్లి కొర్తికంటి జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అలాగే వంశీకృష్ణ ఆత్మహత్యకు కారకులైన శ్రీధర్, శివ, రోహిత్, రంజిత్‌లపై 306 సెక్షన్ కింద కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులు అజ్ఞాతంలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ వివరించారు.

అనంతపేట్ కేజీబీవీలో పలువురు విద్యార్థినులకు అస్వస్థత

నిర్మల్‌రూరల్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపేట్ కేజీబీవీలో శుక్రవారం సాయంత్రం పూర్తిగా ఉడకని అన్నం తినడంతో 10మంది విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని, వీరికి నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించిన అనంతరం 8 మందిని డిశ్చార్జ్ చేశారని ఇన్‌చార్జి ఎస్‌వో దేవిప్రియ తెలిపారు. మరో ఇద్దరు విద్యార్థినులకు అపెండిసైటిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కారణంగానే విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు.

పట్టపగలు దోపిడీ

• బాసరలో భక్తురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన దుండగులు


బాధితురాలు సుశీల

బాసర, డిసెంబరు 27: (ఆంధ్రజ్యోతి): బాసర గోదావరి స్నాన ఘట్టాల వద్ద శుక్రవారం ఉదయం భక్తురాలి మెడలో నుంచి దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సుశీల అనే భక్తురాలు కుటుంబ సభ్యులతో కలిసి బాసర సరస్వతి అమ్మవారి దర్శనం కోసం శుక్రవారం బాసరకు వచ్చారు. ముందుగా గోదావరి స్నానం ఆచరించేందుకు నది తీరానికి వెళ్లారు. అక్కడ ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకొని వెళ్లిపోయారు. సెకండ్‌ల వ్యవధిలో జరగడంతో భక్తురాలికి ఏం జరిగిందో తెలియరాలేదు. బైక్‌పై ఇద్దరున్నారని రెడ్ కలర్ షర్ట్ ధరించిన వ్యక్తి రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కొని వెళ్లిపోయాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలియగానే పోలీసులు అప్రమత్తమై బాసర పరిసరాల్లో గాలించారు. చుట్టు పక్కల రహదారి వెంబడి గల పోలీస్ స్టేషన్‌లకు సమాచారం ఇచ్చినప్పటికి దుండగులు దొరకలేదు. ముథోల్ సీఐ మల్లేష్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పంట పొలాల్లో సోలార్ సెంటర్లు!

• ప్రతిపాదనలు రూపొందిస్తున్న వ్యవసాయ శాఖ • పీఎం కుసుమ్ కింద ప్లాంట్ల ఏర్పాటు • సాగుతోపాటు కరెంటు ఉత్పత్తి దిశగా అన్నదాతలు

నిర్మల్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరిగిపోతుండడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యల వైపు అడుగులు వేస్తోంది. ముఖ్యంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యల కోసం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికి అనుగుణంగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కుసుమ్ (ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం కింద నిర్మల్ జిల్లా వ్యాప్తంగా అనుకూలమైన చోట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని తలపెట్టింది. విద్యుత్‌శాఖ, వ్యవసాయశాఖలు సమన్వయంగా ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది. అయితే ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను పంట పొలాల్లో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. రైతులు తమ పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకున్నట్లయితే వారికి అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించడమే కాకుండా అక్కడి ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కరెంటును కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఒక రైతు పొలంలో గరిష్ఠంగా రెండు మెగావాట్ల సామర్థ్యం వరకు సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తిచేసే ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఈ ప్లాంట్‌లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేయనుంది. యూనిట్‌కు 3 రూపాయల 13 పైసల ధరను ఖరారు చేసింది. ఈ ధరతో మొత్తం రెండు మెగావాట్ల విద్యుత్‌ను కొనుగోలు చేయనున్నారు. రైతులు ఓ వైపు తమ పంట పొలాల్లో పంటలను సాగు చేస్తూనే సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ద్వారా కరెంటును ఉత్పత్తి చేసుకునే విధంగా ఈ యాక్షన్ ప్లాన్‌ను తయారు చేస్తున్నారు. ఈ ప్లాంట్‌లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను అమ్ముకుంటూ రైతులు లాభాలను కూడా ఆర్జించే అవకాశం కల్పిస్తున్నారు.

25 ఏళ్ల వరకూ ఈ పథకం

పంట పొలాల్లో పీఎం కుసుమ్ కింద ఏర్పాటు చేయ తలపెట్టిన సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను 25 సంవత్సరాల వరకు కొనసాగించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా రైతులను సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సాహించనున్నారు. రాయితీలతో పాటు విద్యుత్ కొనుగోలులో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రైతులకు సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. దీనికోసం రాష్ట్రస్థాయిలో రైతు వేదికల ద్వారా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. రైతులు పంటల సాగుకు ప్రాధాన్యతినిస్తూనే సోలార్ విద్యుత్ ఉత్పత్తి చర్యల్లో పాల్గొనేట్లు చేయనున్నారు.

అనుకూల ప్రదేశాల ఎంపిక బాధ్యత వ్యవసాయశాఖదే..



పంట పొలాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుకు అనుకూల ప్రదేశాలనుఅలాగే అక్కడ ఉన్న సౌకర్యాలను పరిశీలించే బాధ్యత వ్యవసాయ శాఖకు అప్పజెప్పారు. దీంతోపాటు ప్లాంట్ ఏర్పాటు చేసుకునే రైతులను ఎంపిక చేయడం వారికి అవసరమైన ప్రోత్సాహకాలను అందించడం దీంతో పాటు వారు ఉత్పత్తి చేసే సోలార్ కరెంటును కొనుగోలు చేయడం లాంటి ప్రక్రియను అంతా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగించాలని భావిస్తున్నారు. విద్యుత్‌శాఖ, వ్యవసాయ శాఖతోపాటు సోలార్ విద్యుత్‌ను పర్యవేక్షించే అధికారులకు ఈ బాధ్యతలను అప్పగించనున్నారు. మొత్తానికి వ్యవసాయ శాఖ ఇక జిల్లాస్థాయిలో సౌర విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు ప్రక్రియ కోసం మండలాల వారిగా లక్ష్యాలను సైతం నిర్దేశించనున్నట్లు చెబుతున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్లాంట్‌ల ఏర్పాటును చేపట్టాలని భావిస్తున్నారు.

• విస్తృత ప్రచారానికి ఏర్పాట్లు

పీఎం కుసుమ్ కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా భారీ ఎత్తున ప్రోత్సాహకాలు లభించనున్న కారణంగా సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటుకు రైతులను సన్నద్ధం చేయబోతున్నారు. దీనికోసం గ్రామస్థాయిలో ప్రచార కార్యక్రమాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు అలాగే గ్రామాల్లోని ఆదర్శ రైతులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఇటు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని కూడా రెట్టింపు చేస్తూ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ల ఏర్పాటు లక్ష్యాలను అధిగమించే దిశగా ప్రయత్నాలు చేపట్టనున్నారు. దీని కోసం గానూ విస్తృతమైన ప్రచారం చేపట్టి సోలార్ సెంటర్లపై రైతుల్లో అవగాహన పెంచాలని భావిస్తున్నారు. మొత్తానికి ఇప్పటివరకు పంట దిగుబడులతో లాభాలకే పరిమితమైన రైతులను సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వాణిజ్యపరంగా లాభాలు అందుకునే విధంగా పీఎం కుసుమ్ పథకం ఉపయోగపడబోనుందని అంటున్నారు.

దేశానికి మన్మోహన్ సింగ్ సేవలు ఎనలేనివి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్


నివాళులర్పిస్తున్న శ్రీహరి రావు


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

పెంబి(ఖానాపూర్), డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): దేశానికి మన్మోహన్ సింగ్ అందించిన సేవలు ఎనలేనివని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశఆర్థిక వ్యవస్థలో పెను మార్పులను తీసుకువచ్చిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందన్నారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుతో కలిసి దేశ ఆర్థిక వ్యవస్థను ఆయన చక్కదిద్దారని గుర్తుచేశారు. ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆయన ఆశయ సాధనకై కృషి చేస్తుందని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్, మండల జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, సీనియర్ నాయకులు యూసుఫ్ ఖాన్, వెంకాగౌడ్, అబ్దుల్ మజీద్, ఎంపీటీసీ శంకర్, మండల మైనార్టీ అధ్యక్షులు సలీం ఖాన్, పట్టణ మైనార్టీ పౌకత్ పాషా, శేషాద్రి, తోట సత్యం, నేరెళ్ల సత్యనారాయణ, పెందూర్ మాధవ్, శారు, రవి పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల సారథి మనోహ్మన్‌సింగ్

భైంసా: స్వర్గీయ మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ అర్థిక సంస్కరణ సారధి అని ముథోల్ మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బోస్లే నారాయణరావ్ పాటిల్ కొనియాడారు. శుక్రవారం భైంసాలో ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులర్పించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తనదైన పరి పాలన దక్షతతో మన్మోహన్‌సింగ్ దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నాడని పేర్కొన్నారు. చిన్న,సన్నకారుల రైతాంగానికి రుణ మాఫీ చేసిన ఘనత మన్మోహన్ సింగ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఆయన హయాంలోనే గ్రామీణ ఉపాధిహామీ చట్టం రూపుదిద్దుకుందని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి జాయతీ దర్యాప్తు సంస్థ ఏర్పాటు చేశారని వివరించారు. ఆర్థికమంత్రిగా పనిచేసిన సమయంలో ఆయన చేపట్టిన సంస్కరణలు, అర్థిక విధానాలు దేశంలో పేదరికాన్ని తగ్గించాయన్నారు, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మెన్‌గా, కేంద్ర అర్థికశాఖ ముఖ్య కార్యదర్శిగా, కేం ద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా స్వర్గీయ మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు అమూల్యమైనవి, అనిర్వచనీయమైనవని కొనియాడారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాటిల్ నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు స్వర్గీయ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చే కూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇందులో మాజీ ఎంపీపీలు ఎస్.భోజరామ్ పాటిల్, పి. రాంచందర్‌రెడ్డిలతో పాటు నియోజక వర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల కాంగ్రెస్ ప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నాయి.

మాజీప్రధానికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నివాళి

నిర్మల్‌కల్చరల్: జిల్లా కేంద్రంలో రిలే దీక్షలు చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం 18వ రోజు రిలే దీక్షలు కొనసాగించారు. పీఆర్‌టీయూ నాయకులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

మాజీ ప్రధాని మృతికి సంతాపం

మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సంతాపం ప్రకటించారు. శుక్రవారం సీతక్క నివాసంలో ఆమెతో కలిసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం ఓ మహోన్నత శిఖరాన్ని కోల్పోయిందని ఆయన మృతి తీరని లోటనిఅన్నారు.


భైంసాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న బోస్లే నారాయణరావ్ పాటిల్


పారిశుధ్య కార్మికులు టోకెన్ సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి: పారిశుధ్య కార్మికులు

• ముథోల్‌లో పంచాయతీ పారిశుధ్య కార్మికుల టోకెన్ సమ్మె

ముథోల్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సేవలను గుర్తించాలని, పంచాయతీ సిబ్బందిని అందరినీ పర్మినెంట్ చేయాలని, జీవో 51ను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని పంచాయతీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని ముథోల్‌లో పంచాయతీ పారిశుధ్య కార్మికులు 2రోజుల టోకెన్ సమ్మె చేపట్టారు. ప్రభుత్వం కేటగిరి వారీగా వేతనాలు పెంచాలని, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. వేతనాల చెల్లింపునకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి నేరుగా కార్మికుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలని, వేతనాలను ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌కేటాయించాలని, గ్రీన్‌ఛానల్ ద్వారావేతనాలు చెల్లించాలని చెప్పారు. జీవో 60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించాలన్నారు. జీవో 51 సవరించాలన్నారు. పాత కేటగిరీలన్నింటిని కొనసాగించాలని కారోబార్ బిల్‌కలెక్టర్లను సహాయకకార్యదర్శిగా నియమించాలని, అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్‌చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు చెల్లించాలని, ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చినహామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముథోల్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మిక సభ్యులు అశోక్, బి. శంకర్, ఎస్. లక్ష్మణ్, భూమన్న, జి. త్రిశూల, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాలో పూర్తిస్థాయి బూత్ కమిటీల నియామకం'

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పూర్తిస్థాయి బూత్ కమిటీలను ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా అధ్యక్షుడు కే.అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆయా మండలాల్లోని బూత్ కమిటీలకు అధ్యక్షుల నియామకం జరుగుతోందని తెలిపారు. భారీ సంఖ్యలో ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారని వివరించారు. కేంద్రప్రభుత్వ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు కమిటీలు కృషి చేస్తాయన్నారు. స్థానిక సంస్థల్లో గెలుపే దిశగా పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

• టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ • నిర్మల్ జిల్లా 7వ మహాసభలు

నిర్మల్‌కల్చరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండ గడదామని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. టీఎన్జీవో సంఘ భవనంలో శుక్రవారం 7వ జిల్లా మహాసభలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బక్కన్న జెండా ఆవిష్కరించారు. కృష్ణ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చి హక్కులను కాలరాశారని ఆరోపించారు. కార్మిక కుటుంబాలకు కన్నీరు మిగిల్చారన్నారు. సంపద సృష్టించే కార్మిక కుటుంబాల ఉసురు కొడుతుందని, కేంద్రం పతనం కాక తప్పదని జోస్యం చెప్పారు. జనధన్ ఖాతాలో పేదలకు 15లక్షల జమ, నిత్యావసర ధరల నియం త్రణ, ఏటా 2కోట్ల కొలువులు తదితర ఎన్నికల హామీలు అమలు కాలేదన్నారు. సంపద మొత్తం పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. మత సామరస్యానికి వి ఘాతం కలిగించే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ ఉద్యమకారులు, ప్రశ్నించే గొంతులపై నిర్బంధం విధిస్తోందన్నారు. హక్కుల సాధనకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్ర భుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరుహామీలు అమలు చేయాలని, కార్మికులకు జీవనభృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు నంది రామయ్య లక్ష్మీ, గంగన్న, జి.గంగామణి, పోశెట్టి, గఫూర్, ఆర్. రామలక్ష్మణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వనమాల కృష్ణ

సమగ్రశిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెతో

కేజీబీవీలకు ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు

● 18వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె ● శుక్రవారం నుంచి సమ్మెబాట పట్టిన నాన్ టీచింగ్ స్టాఫ్ ● నిర్వహణ ప్రత్యేకాధికారులుగా మహిళా ఉపాధ్యాయులు



మామడ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం



నిరసన ప్రదర్శనలు చేపడుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భైంసా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఉద్యోగుల సమ్మెకు తోడు శుక్రవారం నుంచి నాన్‌టీచింగ్ స్టాఫ్ సైతం తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మెబాట పట్టారు. ఈ క్రమంలో జిల్లాలోని కేజీబీవీల నిర్వహణ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థుల పరిస్థితులు అగమ్యగోచరంగా మారింది. దీంతో ప్రభుత్వం కేజీబీవీల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే జిల్లాలోని ఒక్కో కేజీబీవీ పాఠశాలలకు ఆయా మండలాల్లోని మహిళా ఉపాధ్యాయురాళ్లను ప్రత్యామ్నాయ ప్రత్యేక అధికారులుగా జిల్లా విద్యాశాధికారి బాధ్యతలు అప్పచెబుతూ ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు తమకు బాధ్యతలు అప్పచెప్పిన కేజీబీవీలకు వెళ్లి నిర్వహణ వ్యవస్థను చేపట్టారు. అయితే కొంతమంది ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా బాధ్యతల నిర్వహణకు వెనుకంజ వేసినట్లుగా సమాచారం. అయితే ఉన్నతాధికారులు సంబంధిత ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులపై ఒత్తిడి తీసుకవచ్చి బాధ్యతలను నిర్వాహణకు తరిలించినట్లుగా తెలిసింది.

● అవస్థలు పడ్డ ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు

సమగ్ర శిక్షా ఉద్యోగులతో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్ సైతం సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు కేజీబీవీల నిర్వాహణ వ్యవస్థను ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు చేపట్టారు. అయితే కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులకు భోజన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు అపసోపాలు పడ్డట్టుగా తెలిసింది. పలు చోట్ల తాత్కాలికంగా వంట చేసే వారు దొరకక వారంతా అష్టకష్టాలు పడ్డట్లుగా సమాచారం. వంట మనుషులు దొరకక, కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనం మూడు గంటల తదుపరే వండి పెట్టినట్లుగా సమాచారం. గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు అందుకున్న ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులు శుక్రవారం ఉదయం తమకు బాధ్యతలు కేటాయించిన కేజీబీవీలకు తరలివెళ్లారు. అయితే నాన్ టీచింగ్ స్టాప్ ఎవరు లేక నిర్వాహణ వ్యవస్థ కోసం వారంతా పడరాని పాట్లు పడ్డట్లుగా తెలిసింది.

సమ్మె పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● నరేంద్రబాబు, అధ్యక్షులు, పీఆర్‌టీయూ, నిర్మల్ జిల్లా



రాష్ట్ర ప్రభుత్వం కాలయాపనకు తావులేకుండా సమగ్ర శిక్షా ఉద్యోగుల, నాన్ టీచింగ్ స్టాఫ్ సమ్మె పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. 18 రోజుల నిరవధిక సమ్మెతో కేజీబీవీల్లో బోధన వ్యవస్థ స్తంభించింది. ఇదే క్రమంలో ప్రత్యామ్నాయ ప్రత్యేకాధికారులుగా ఉపాధ్యాయులను నియమించిన ప్రభుత్వం సంబంధిత నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా నిలవాలి.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

సంఘాల బలోపేతానికి కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వర్తక, వ్యాపార, వాణిజ్య సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన భైంసా వెండి, బంగారు వర్తక సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా సంఘాల పటిష్టతకు, సభ్యుల సంక్షేమానికి చేయూతనిస్తామని తెలిపారు. అర్హులైన సంఘాల సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తానని వివరించారు. సంఘ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షైన గోపాల్, కోర్వ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ సంఘ బలోపేతమే ధ్యేయంగా, సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు సంఘ పెద్దలు ప్రమాణ స్వీకారం చేయించగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో మున్సిపల్ మాజీ చైర్మన్ బి. గంగాధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్ బాబు, సంఘ ప్రతినిధులు కలికోట రాములు, సాధం నారాయణ, కళ్యాణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కేజీబీవీలలో డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగుల రిలే దీక్షల సందర్భంగా కేజీబీవీలలో నియమించిన డిప్యూటేషన్లు రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగ ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులిస్తేనే వేలానికి సహకరిస్తాం

● పూజాసామగ్రి దుకాణం వేలంపాటను అడ్డుకున్న పాలకవర్గం

దిలావర్‌పూర్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): పురాతన పుణ్యక్షేత్రం శ్రీమాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వర స్వామి దేవస్థానం పట్ల దేవాదాయ శాఖ అధికారులు అవలంబిస్తున్న తీరుపై దేవస్థానం పాలకవర్గం తీవ్రంగా మండిపడింది. శుక్రవారం దేవస్థానానికి చెందని కొబ్బరికాయలు, ఇతర పూజ సామాగ్రి దుకాణాన్ని వేలం వేసేందుకు అధికారులు, పాలకవర్గం, భక్తులు, కదలి, మాడెగాం, కుస్లీ గ్రామస్థులు సమావేశమయ్యారు. దుకాణాన్ని వేలం వేసేందుకు అధికారులు ఉపక్రమించగానే పాలకవర్గంతోపాటు గ్రామస్థులు అడ్డుకున్నారు. దేవస్థానంలో మౌళిక సదుపాయాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడాన్ని ఎత్తి చూపారు. అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడాన్ని ప్రశ్నించారు. దేవస్థానం నుండి రూ. లక్షల ఆదాయాన్ని పొందుతూ అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఇవ్వరా... అని నిలదీశారు. భక్తులు ఇచ్చే విరాళాలతో అభివృద్ధి చేద్దామంటే అధికారులు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కోతులతో తీవ్ర ఇబ్బంది అవుతోందని అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దుకాణం టెండర్ దక్కించుకున్న వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నప్పటికీ దేవస్థానంలో కనీస వసతులు లేవన్నారు. మౌళిక సదుపాయాలు కల్పించే వరకు టెండర్ నిర్వహించనీయమని అన్నారు. దీంతో అధికారులు టెండర్‌ను రద్దు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో దేవస్థానం చైర్మన్ నార్వాడీ వెంకట్రావు పాటిల్, డైరెక్టర్ దత్తురామ్ పాటిల్, ఇతర పాలక వర్గం సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బూత్ కమిటీల ఎన్నికలను గడువులోగా పూర్తిచేయాలి

భైంసా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా బూత్ కమిటీల ఎన్నికలను అధిష్టానం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భైంసా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, ముథోల్ నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణ రెడ్డి, రవి పాండే, జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లోడ్ శ్రీనివాస్‌లతో కలిసి సుడిగాలి పర్యటన చేపట్టి ఆయా ప్రాంతాల్లోని బూత్ కమిటీల ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల పార్టీ బాధ్యులు, బూత్ కమిటీల ఎన్నికల నిర్వాహకులతో సమీక్ష సమావేశాలు చేపట్టి దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సమర్థవంతులకు బూత్ కమిటీల్లో చోటు కల్పించాలన్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల తొలి ఘట్టమైన బూత్ కమిటీల ఎన్నికలు పూర్తయిన పిదప మండల కమిటీల ఎన్నిక జరుగనుందని వివరించారు. ఇందులో ఆయా ప్రాంతాల పార్టీ బాధ్యులు, మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన చైర్మన్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ నుంచి ప్రధాన ఆసుపత్రి వైపు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ శుక్రవారం పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహం నుండి గుంతలుగా మారిన రోడ్డు మరమ్మతులు చేపడతామని తెలిపారు. కౌన్సిలర్ ముజ్జు చౌస్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నర్సాపూర్(జి), డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ముష్కం వెంకటేష్ గౌడ్ అనే బాధితుడికి మంజూరైన రూ. 24 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బర్కుంట నరేందర్, దత్తురాం, దూసముడి సవీన్, మహేష్, రాజు, తదితరులున్నారు.

'పంచాయతీల్లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యం'

దిలావర్‌పూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని దిలావర్‌పూర్, సిర్గాపూర్, గుండంపల్లి గ్రామాల్లో బూత్ అధ్యక్షుల ఎన్నికల్లో భాగంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిగా పార్టీ కోసం పని చేయాలన్నారు. ఎన్నికైన బూత్ అధ్యక్షులు సైతం తమ బూత్ పరిధిలో మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. దిలావర్‌పూర్ గ్రామంలో 7 బూత్‌లు ఉండగా ఆయా బూత్‌లకు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉదిరిగి సాయి, ముత్యం, యోగేందర్‌రెడ్డి, బొల్ల సాయి, అనిల్ ముదిరాజ్, పండరి, భోజన్న అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బూత్ అధ్యక్షులను జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, బీజేపీ సీనియర్ నాయకుడు పోడెల్లి గణేష్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్, మాజీ జడ్పీటీసీ రమణారెడ్డి, దొడ్డికింది ముత్యం రెడ్డి, సత్యం చంద్రకాంత్, మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాజలింగం, స్థానిక నాయకులు ఉమాశంకర్, ధని నర్సయ్య, హరీష్, తక్కల శ్రీకాంత్ రెడ్డి, లారా, భూమారెడ్డి, నిరంజన్ రెడ్డి, దీక్షిత్ రెడ్డి, రాజు పటేల్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుబాయ్‌లో అనారోగ్యంతో గొల్లమాడవాసి

● జిల్లాకు తీసురావాలని కోటపాటిని కలిసిన కుటుంబీకులు

నర్సాపూర్(జి), డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లమాడ గ్రామ వాసి కేసారం జైరాం కొన్నేళ్ల క్రితం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి దుబాయ్‌లోని ఓ నిర్మాణ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 15రోజుల క్రితం జైరాంకు తీవ్ర అస్వస్థత ఏర్పడి పక్షవాతం రావడం వలన కంపెనీ అధికారులు దుబాయ్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుండి జైరాం సమాచారం లేక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జైరాంకు సరైన చికిత్స చేయించి ఇంటికి క్షేమంగా రప్పించాల్సిందిగా ఆర్మూర్‌కు వచ్చి 'ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక' అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడును కలిసి విన్నవించారు. ఇక్కడికి చేరుకున్న వెంటనే తెలంగాణ ప్రభుత్వం ఎన్ఆర్ఐ సెల్ అధికారుల సహకారంతో ఎన్ఐఎంఎస్‌లో చేర్పించడానికి తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు వినతి పత్రం పంపించారు.

పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి

పెంబి, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు సుంచు నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గత ఏడు రోజుల నుండి సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవ వేతనం, గుడ్ల బిల్లు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ మండల అధ్యక్షులు మెట్ల లక్ష్మీ, మమత, కే.పోసవ్వ, ఆశవ్వ పాల్గొన్నారు.



పనులు ఆగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

రహదారి నిర్మాణానికి సహకరించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని తిరుపల్లి కాలనీ సమీపంలో ఆగిపోయిన రహదారి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. శుక్రవారం రహదారి నిర్మాణం వల్ల ఇళ్లను కోల్పోతున్న వారితో ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణం వల్ల పట్టణాభివృద్ధితో పాటు ప్రయాణికులకు మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ఇండ్ల యజమానులు ముందుకు వస్తే రావాల్సిన నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఆయన వెంట నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

'మాజీ ప్రధాని మృతి దేశానికి తీరని లోటు'

నేరడిగొండ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం పట్ల బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ద్రిగ్భాంతిని వ్యక్తం చేశారు. దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థికరంగ నిపుణుడిగా గొప్ప పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. పీవీ మనసు గెలిచిన మన్మోహన్‌సింగ్ అనేక ఉన్నత శిఖరాలకు చేరుకున్న భరతమాత ముద్దుబిడ్డ అన్నారు. ఆయన హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరుగడం చారిత్రక సందర్భం అని అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని తెలంగాణ ఏర్పాటుకు సంపూర్ణ మద్ధతు ప్రకటించారని అన్నారు.

'ప్రధానిగా పదేళ్ల పాటు దేశానికి సేవలు'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ దేశ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి పట్ల మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రధానిగా పదేళ్ల పాటు దేశానికి సేవలందించిన ఆయన మృతి తీరని పేర్కొన్నారు. అనేక ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపారని కొనియాడారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

'అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి'

ఇచ్చోడ, డిసెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయా రాజకీయ పార్టీలు, కులసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తా నుంచి అంబేద్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలిలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్, నాయకులు కుమ్రం కోటేశ్వర్, నారాయణరెడ్డి, ధర్మపాల్, సాబీర్, ఆశన్న, లస్మన్న, చందు, మెరాజ్, ఊశన్న, ముస్తఫా, లక్ష్మణ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు

● ఆదిలాబాద్‌లో నేతలు, నాయకుల ఘన నివాళి

ఉట్నూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారతదేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని డాక్టర్ మన్మోహన్‌సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం ఆధ్వర్యంలో సంతాపం తెలిపి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి చంద్రయ్య, బిరుదుల లాజర్, ఎక్బాల్, అచ్చ దేవానందం, కొడప రాధాబాయి, సులోచన, మేస్రం భాగ్యలక్ష్మి, నిస్సర్, గంగాధర, రాజేశ్వర్, ఎస్.రాజేశ్వర్, కలీంపాషా, రాజాగౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

అలాగే, ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ముందు ఉన్న సమ్మె శిబిరంలో సీఆర్టీలు దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారిలో జిల్లా అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి వంశీ, ఉమ్మడి జిల్లా నాయకులు గోడం శ్రీనివాస్, వినంతరావు, సోమేశ్వర్, కమలాకర్, రాంచందర్, విద్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

● ఆర్థిక సంస్కరణల సారథి మన్మోహన్‌సింగ్

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణ సారథి అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్, ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్రం కోటేశ్వర్ కొనియాడారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందులో నాయకులు కొత్తురి లక్ష్మణ్, ముస్తఫా, ప్రభాకర్, శివకుఎర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

● పరివర్తన చెందిన సంస్కరణల ద్వారా గుర్తింపు

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): డాక్టర్ మన్మోహన్‌సింగ్ 1991లో ఆర్థిక మంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా పరివర్తన చెందిన ఆర్థిక సంస్కరణల ద్వారా గుర్తించబడ్డారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండాను అవనతం చేశారు.

● యువతరానికి ఆదర్శ ప్రాయుడు

నార్నూర్(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి యావత్ దేశానికి తీరని లోటు అని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెందోర్‌సంతోష్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేదావి, మితభాషిగా, సౌమ్యుడు, స్థితప్రజ్ఞత కలిగిన నేతగా మన్మోహన్‌సింగ్ మన యువతరానికి ఆదర్శమన్నారు. సౌమ్యత, వినయానికి ప్రతీక. భారత రాజకీయాలకు మార్గదర్శకుడు. భారత ఆర్థిక వ్యవస్థకు ఆధునిక నిర్మాత నిరాడంబర జీవితం, దేశం పట్ల వారి అంకిత భావం, భావితరాలకు స్ఫూర్తిదాయకం పేర్కొన్నారు. వారి వెంట నాయకులు సంతోష్‌జాకు, గోవిందు తదితరులున్నారు.



ఇచ్చోడలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు

● బోథ్‌లో పలువురు నాయకుల సంతాపం


బోథ్(ఆంధ్రజ్యోతి): భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణ ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం బోథ్ బస్టాండ్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ రమణగౌడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మ ఆజీ డైరెక్టర్ మడావి భీమ్రావు మాజీ ఎంపీటీసీ శేఖర్‌అప్ప, జాబీర్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. కాగా బోథ్ బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశం ఒక గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోయిందని మార్కెట్ కమిటీ చైర్మన్‌బొడ్డుగంగారెడ్డి మాజీ చైర్మన్ గొర్లరాజుయాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెట్ల ఉమేష్, షేక్‌నాజర్ అహ్మద్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తు రమేష్, భోజన్న, గట్ల గంగాధర్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అలాగే, ఆర్థిక సంస్కరణ వాది మన్మోహన్‌సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బి.మల్లేష్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మల్లెపూల సత్యనారాయణలు పేర్కొన్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్లరవితో పాటు పలువురున్నారు. అలాగే, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని, వారి ఆత్మకు శాంతి కలగాలని పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణ ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్ అన్నారు. ఇందులో గ్రంథాలయ మాజీ డైరెక్టర్ రమణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మడావి భీమ్‌రావు, మాజీ ఎంపీటీసీ శేఖరప్ప, జాబీర్, శ్రీనివాస్, శేఖర్ తదితరులున్నారు.

తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో మన్మోహన్‌సింగ్ మృతి పట్ల ఉపాధి కూలీలు, కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు.

అలాగే, ఇంద్రవెల్లి, మావల మండలాల్లోనూ ఘన నివాళ్లర్పించారు.

రాత్రివేళలో మర్నాగి తిరుగుతోందని ఆందోళన!

ఇంద్రవెల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాంనగర్(బాజర్‌గల్లి) వీధిలో గత మూడు రోజుల నుంచి మర్నాగి రాత్రి సమయంలో తిరుగుతోందని వీధి ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే మర్నాగి రెండు రోజుల నుంచి వీధిలో ఉండే మూడు కుక్కలను తినేసిందని, రాత్రి 10.30 సమయంలో బయటకు వస్తోందని వీధి వాసులు పేర్కొన్నారు. మర్నాగిని స్వయంగా చూశామని కృష్ణ జుజారే, ప్రశాంత్, అజయ్, గాడిగే, గౌరవ్‌లతో పాటు పలువురు తెలిపారు. ఇంద్రవెల్లి పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ గణేష్ టాహీరే ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో సైతం మర్నాగి కదలికలు రికార్డు అయ్యాయని ప్రజలు అంటున్నారు. సీసీ కెమెరాలో మర్నాగి దూరం నుంచి రికార్డు కావడంతో కనిపించడం లేదని, రాత్రి వేళలో మర్నాగి చిత్రాన్ని తీసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వో సంతోష్ వివరణ కోరగా.. మర్నాగి తిరుగుతున్నట్లు తమ దృష్టికి రాలేదని అన్నారు. అయితే ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకవెళ్లి నిఘా ఏర్పాటు చేస్తామని ఎఫ్ఆర్‌వో పేరొన్నారు.



రాంనగర్ వీధిలో తిరుగుతున్న మర్నాగి

నాణ్యత పేరిట సీసీఐ కొర్రీలు

(5వ పేజీ తరువాయి...)

రైతులు చెబుతున్నారు. కానీ శ్యాంపుల్ టెస్టింగ్ పేరిట నాణ్యతను నిర్ధారించడం సరైంది కాదంటున్నారు. చలక నేలల్లో కొంత వరకు పత్తి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎందుకంటే నీటి తడి లేక తొందరగానే ఆకులు ఎండిపోయి పత్తిని ఏరే సమయంలో పత్తితో కలిసిపోయి నాణ్యత దెబ్బతింటుంది. కానీ నల్లరేగడి నేలల్లో నీటి తడులు అందించిన పత్తిలో నాణ్యత ఇప్పుడే దెబ్బతినే అవకాశం ఉండదు. కానీ అధికారులు మాత్రం అన్ని రకాల పత్తిని ఒకేలా పరిగణించి ధరల్లో కోతలు విధించడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌కు వచ్చిన పత్తిని రైతుల వారీగా నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి ధరను చెల్లిస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈనెల 31 నుంచి మద్దతు ధర తగ్గింపు

: గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్



ప్రస్తుతం పత్తి నాణ్యత తగ్గిందంటూ సీసీఐ అధికారులు మద్దతు ధరను తగ్గించాలని నిర్ణయించారు. ఈనెల 31 నుంచి మద్దతు ధరలో రూ.50 తగ్గింపు ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న రూ.7,521 క్వింటాలు మద్దతు ధర డిసెంబరు 31నుంచి రూ.7,471 ఉంటుంది. దీనిని రైతులు పరిగణలోకి తీసుకోవాలి. సీసీఐ సంస్థ ఆదేశాలతోనే ధర తగ్గింపును నిర్ణయించడం జరుగుతుంది. రైతులు నాణ్యత గల పత్తిని తీసుకొచ్చి మద్దతుధరను పొందాలి.

నేడు కేబీ కాంప్లెక్స్‌లో జాబ్‌మేళా

ఉట్నూర్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం శనివారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు ఏడు కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, 1031 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 7వ తరగతి నుంచి పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిఫార్మసీ, బీఫార్మసీ విద్యార్హతలతో వివిధ కేటగిరిలలో ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న 18 నుంచి 32ఏళ్ల లోపు వారు ఉదయం 10గంటల నుంచి వైటీసీ ఆవరణలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పీవో పేర్కొన్నారు.

ఆడె గజేందర్‌ను కలిసిన నాయకులు

నేరడిగొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడె గజేందర్‌ను బజార్‌హత్నూర్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల అభివృద్ధికి సహకరించాలని, ఇందిరమ్మ ఇళ్లను మండలానికి కేటాయించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆడే గజేందర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి బాగలేక జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయితీ పరిధిలోని న్యూ హీరాపూర్(రమాయినగర్)లో జరిగింది. ఏఎస్సై భీంరావు తెలిపిన వివరాల ప్రకారం రమాయినగర్ గ్రామానికి చెందిన మెస్రం నాగేష్ (20) గత కొంత కాలంగా మానసిక స్థితి బాగ లేక బాధపడుతున్నాడు. కుటుంబీకులు నాటు వైద్యం చేయించిన ఆరోగ్యం కుదుట పడలేదని తెలిపారు. మానసిక స్థితి కుదుట పడకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో జీఏ వైర్‌తో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికొచ్చిన తల్లిదండ్రులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి మెస్రం షేకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భీంరావు తెలిపారు.

ఇరుకు వంతెనలతో ఇబ్బందులు




గోండుకొత్తగూడ వంతెన స్టీల్ దొంగల పాలుకావడంతో ప్రమాదకరంగా మారిన వంతెన


ప్రమాదకరంగా ఉన్న నాగాపూర్ వంతెన

ఉట్నూర్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్మించిన ఇరుకు వంతెనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు నాటి అవసరాలను తీర్చాయి. కాని నేడు పెరుగుతున్న వాహనాలకు దీటుగా వంతెనలకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోని పాలకులు ఈ మరమ్మతుల గురించి విస్మరించగా నేటి పాలకులైనా వీటి పట్ల దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవులు... ఈ వంతెనలు..

ఉట్నూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్లే రహదారిపై చెక్‌పోస్టు కొత్తగూడ దాటిన వెంటనే వస్తున్న వంతెనతో పాటు గోండు కొత్తగూడ, కోలాంగూడ గ్రామాల మధ్య ఉన్న వంతెన, మారుతిగూడ దంతనపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెనల స్టీల్‌ను దొంగలు అపహరించకపోవడంతో ఈ వంతెనలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇదే రోడ్డుపై తాటిగూడ గ్రామం


ప్రమాదకరంగా ఉన్న షాంపూర్ వంతెన

దాటిన వెంటనే వస్తున్న పెద్దవాగు వంతెన ఇరుకుగా ఉంది. ఇదిలా ఉండగా ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న రహదారిపై లింగోజితండా ఎక్స్‌రోడ్డు నుంచి నాగపూర్ వాగుపై ఉన్న నాగపూర్ వంతెన, షాంపూర్ వంతెనలు ఇరుకుగా ఉండడంతో పాటు వంతెనపై ఉండే ఖనీలు (బండరాళ్లు) వెళ్లిపోయాయి. అదే విధంగా ఎందా సమీపంలోని మూలమలుపు వద్ద ఉన్న ఇరుకు వంతెనతో కూడా ఇబ్బందులవుతున్నాయి. ఫలితంగా తరుచూ ఈ ఇరుకు వంతెనల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాగాపూర్ వంతెనలో రెండేళ్ల క్రితం ప్రమాదానికి గురైన లారీ వాగులో పడింది. షాంపూర్ వంతెన వద్ద లెక్కలేనన్ని ప్రమాదాలు జరిగాయి. పులిమడుగు వాగుపై ఉన్న వంతెన సైతం ఇరుకుగా ఉంది. ఇక్కడ కూడా తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా రోడ్డు భవనాలశాఖ అధికారులు దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలకు మరమ్మతులు చేసేలా ప్రతిపాదనలు పంపించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి పంజాబ్‌లోని సంగూర్‌లో నిర్వహించే 37వ జాతీయ స్థాయి సీనియర్ నేషనల్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల బేస్‌బాల్ పోటీల్లో జిల్లా తరఫున ప్రతిభ కనబరిచిన ఇచ్చోడ మండల సిరిచెల్మకు చెందిన చెవుల సమత, జైనథ్ మండలం సావాపూర్‌కు చెందిన టింగని లోకేష్‌లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు.

ఈ మేరకు వారు పంజాబ్‌కు బయలుదేరినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను,జిల్లా జట్టు కోచ్ బొంగురాల గౌతంను డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.


ఎంపికైన చెవుల సమత


టింగని లోకేశ్

మాజీ సర్పంచుల ఆందోళన


భైంసాలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

- భైంసాలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేత
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు

భైంసా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేరుకుపోయిన గ్రామ పంచాయతీల బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డివిజన్ పరిధిలోని మాజీ సర్పంచులు శుక్రవారం భైంసాలో ఆందోళనలు చేపట్టారు. రాష్ట్ర మాజీసర్పంచుల సంఘం ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో మాజీ సర్పంచులు ముందుగా గాంధీగంజ్ ఎదుట గల గాంధీ మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బకాయి బిల్లులకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గాంధీ విగ్రహానికి అందజేశారు. అనంతరం ప్రధాన రోడ్డుమార్గంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. బిల్లులు చెల్లింపులు జరుగక మాజీసర్పంచులు ఎదుర్కొంటున్న ఆర్థిక దుర్లభ పరిస్థితులను వివరించారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ సర్పంచుల సంఘానికి చెందిన పలువురు డివిజన్ ప్రతినిధులు రాజేందర్, అప్పాల రాకేష్, దెగ్లూర్ రాజు, కిష్టయ్య, రమేష్‌లతో పాటు పలువురు మాట్లాడుతూ గత ప్రస్తుత ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు చేపట్టడంలో నిర్లక్ష్యపూరిత ధోరణి విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. తాము సర్పంచులుగా ఉన్న పదవీకాలంలో ప్రభుత్వం, అధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఎలాంటి పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీచేసి చేపట్టామన్నారు. తాము ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ పెద్దల ఆదేశాలు కాదనలేక, గ్రామసమస్యలు దూరమవుతాయన్న ఉద్దేశంతో వివిధ పథకాలు, గ్రాంటులకు సంబంధించిన ప్రగతి పనులు నిర్దేశిత కాలంలో పూర్తిచేశామన్నారు. పనులకు సంబంధించిన బిల్లులు త్వరితగతిన విడుదల అవుతాయని అధికారులు పేర్కొన్న దరిమిలా తామందరం అప్పు, సొప్పు చేసి పనులను పూర్తి చేశామని వివరించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం


తలపడుతున్న మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ మహిళా జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని స్టేడియంలో నిర్వహిస్తున్న 'సీఎం కప్' రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఇండోర్ స్టేడియంలో పోటీలను డీవైఎస్‌వో శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టోర్నీకి 33 జిల్లాల నుంచి 850 మంది క్రీడా కారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, విలియం, వేణుగోపాల్, బాల్‌రాజ్, నిరంజన్‌యాదవ్, రిటైర్డ్ పీడీ చెన్నవీరయ్య, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభారంభం చేసిన మహబూబ్‌నగర్ మహిళా జట్టు

మహిళా విభాగంలో మహబూబ్‌నగర్ మహిళా జట్టు శుభారంభం చేసింది. మహబూబ్‌నగర్ జట్టు ఆదిలాలబాద్‌పై 57-09 స్కోర్ తేడాతో గెలిచింది. నల్గొండ జట్టు నిజామాబాద్‌పై 70-18, రం గారెడ్డి జట్టు సిద్దపేటపై 50-07, హైదరాబాద్ జట్టు నారాయణపేటపై 49-18, మహబూబాబాద్ జట్టు ఖమ్మంపై 30-26, సంగారెడ్డి జట్టు పెద్దపల్లిపై 50-10, నాగర్‌కర్నూల్ జట్టు మెదక్‌పై 41-10, మెడ్చల్ జట్టు కామారెడ్డిపై 41-04 స్కోర్ తేడాతో గెలుపొందాయి.

పురుషుల విభాగంలో....

పురుషుల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జట్లు శుభారంభం చేశాయి. నాగర్‌కర్నూల్ జట్టు జగిత్యాలపై 28-17, వనపర్తి జట్టు మహబూబ్‌నగర్‌పై 38-10, గద్వాల జట్టు నిర్మల్‌పై 44-15 స్కోర్ తేడాతో గెలుపొందాయి. రంగారెడ్డి జట్టు మెడ్చల్‌పై 45-32, కొత్తగూడెం జట్టు సూర్యాపేటపై 23-16, నల్గొండ జట్టు సిరిసిల్లపై 35-15, హైదరాబాద్ జట్టు కామారెడ్డిపై 41-15, కరీంనగర్ జట్టు వరంగల్‌పై 27-11, ములుగు జట్టు మెదక్‌పై 48-26, నిజామాబాద్ జట్టు భూపాలపల్లిపై 24-15 స్కోర్ తేడాతో గెలిచాయి.

పరీక్షా సమయం... పారాహుషార్

భైంసా, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒక అడుగు ముందుకు పడిదంటే దాన్ని వెనక్కి తీసుకోవచ్చు.. కానీ సమయం అలా కాదు. కాలాన్ని మనకు అనుకూలంగా మలుచుకోవడమే అందరం చేయాల్సిన పని. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఆయా స్థాయిలకు అనుగుణంగా సమయం విలువ మారుతూ ఉంటుంది. అయితే చాలా మంది విలువైన తమ సమయాన్ని వృథా చేస్తున్నారు. చేతులు కాలక ఆకులు పట్టుకున్నట్లు చివరిలో జ్ఞానోదయం జరిగి.. అలా చేస్తే బాగుండేది. ఇలా చేయాల్సింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేవాళ్లం. అని చాలా మంది అనుకుంటారు. ఇలాంటి సందర్భం చాలా మందికి ఎదురవుతుంది. కానీ ఏం లాభం.? అప్పటికే జరగాల్సింది జరిగిపోయి ఉంటుంది. యుక్తవయులో ఏం చేసినా సరదాగానే ఉంటుంది. సమయం వృథా అవుతున్నా పరిగణలోకి రాదు. ఇది పోతే మరో అవకాశం అని అనుకుంటూ వెళ్తుంటారు. ప్రతి ఒక్కరు జీవితంలో విద్యార్థి దశ నుంచే సమయం విలువ తెలుసుకోవాలి. చదువు ఆహార అలవాట్లలో పక్కాప్రణాళిక ఉంటే విజయం సాధ్యం అవుతుంది. ముందున్నదంతా పరీక్షల సమయం, ఇప్పటి నుంచే కళ్ల ముందు ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే లక్ష్యాలను చేరుకోవచ్చు. వచ్చే మార్చి మాసంలో పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి షెడ్యూల్ విడుదలయింది.. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ యేడాది పదో తరగతిలో వంద శాతం


చదువుకుంటున్న విద్యార్థులు


క్రికెట్ మ్యాచ్ చూస్తున్న విద్యార్థులు

ఉత్తీర్ణత ఫలితాలు సాధించేందుకుగాను విద్యాశాఖాధికారులు ప్రణాళికబద్ధమైన చర్యలను చేపట్టారు.

● అవరోధాలు అధిగమించాలి...

సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్

ఉజ్వల భవిష్యత్తు ఏర్పర్చుకోవాల్సిన యువతకు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ అవరోధాలుగా మారాయి. కేవలం విజ్ఞాన సముపార్జనకే సాంకేతికత వినియోగిస్తే మేలు. టీవీకి సాధ్య మైనంత దూరంగా ఉంటేనే చదువుకు దగ్గర వుతామనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ఉన్న కొద్ది సమయాన్ని కబుర్లతో కాకుండా పరీక్షలో నెగ్గాలనే ఆశయంతో చదవాలని నిపుణులు చెబుతున్నారు.

● ఇవి తెలుసుకోండి

- నిన్న అనేది రద్దు చేసిన చెక్కు లాంటిది రేపు అనేది ప్రామీసరీ నోటు వంటిది. ఇప్పుడు మన చేతలే భవిష్యత్తు నిర్ణయిస్తాయి. డబ్బు కన్నా.. సమయం విలువైనదని గుర్తెరగాలి.
- చదువుతో పాటు నిద్రకూ తగిన సమయం కేటాయించాలి. ఆరోగ్య సూత్రాలు పాటించాలి. పుస్తక పఠనమే కాలక్షేపం కావాలి.
- ఎవరికైనా 24 గంటలే : ఎవరికైనా రోజుకు 24 గంటలు సమయమే ఉంటుంది. ఆ సమయంలో వినియోగంతోనే కొందరు విజేత లుగా ప్రణాళిక లేక మరికొందరు పరాజితు లవుతున్నారు. వాయిదాలు వేయకుండా క్రమ శిక్షణతో పక్కా కార్యాచరణ రూపొందించుకోవాలి.

● అంశాలవారీగా సన్నద్ధమవ్వాలి

- ఉన్న సమయం, సిలబస్‌ను విశ్లేషించుకోవాలి. సబ్జెక్టుల వారీగా పోటీపడే అభ్యర్థులు ప్రణాళిక రూపొందించుకోవాలి.
- పాత పేపర్లు, పోటీ పరీక్షల కోసం వెలువడుతున్న మాగజీన్లపై పూర్తిగా ఆధారపడవద్దు సిలబస్ పైనే ఎక్కువగా దృష్టిసారించాలి.
- రోజంతా పుస్తకాల మీదే ఉంటు ఒత్తిడికి గురవుతారు. అంశాల వారీగా చదివితే.. తక్కువ సమయంలో ఎక్కువ విషయాలపై పట్టు సాధించవచ్చు
- అత్యుత్తమ మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు దోహద పడతాయి. ఆంగ్లం, గణితంలో మెలకువతో నిత్య సాధనతోనే పట్టు సాధించగలరు.. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను ఇంటికి వెళ్లిన తర్వాత మరోసారి చదవాలి. సందేహాలు వెంటనే నివృత్తి చేసుకోవాలి.

నాలుగు రోజుల పాటు నిలిచిపోనున్న

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లావాదేవీలు



తెలంగాణ గ్రామీణ బ్యాంక్

భైంసా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రాంతాల్లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) లావాదేవీలు రానున్న నాలుగురోజుల పాటు పూర్తిగా నిలిచిపోనున్నాయి . భైంసా టీజీబీ బ్యాంక్ మేనేజర్ పి. జగదీష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాఖలన్నీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం వేదికగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు టీజీబీ బ్యాంక్ కార్యకలాపాలు, లావాదేవీలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు , ఖాతాదారుల సేవలు పనిచేయవు. జనవరి 1 నుంచి తిరిగి యదావిధిగా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. అయితే సోమ, మంగళ వారాల్లో లావాదేవీలు కొనసాగనప్పటికి బ్యాంక్ అధికారులు, సిబ్బంది విధులకు హాజరవుతారని, ఖాతాదారులకు అందుబాటులో ఉంటారని వివరించారు. రైతులు, ఖాతాదారులు సంబంధిత విషయాన్ని గుర్తించి సహకరించాలని భైంసా టీజీబీ బ్యాంక్ మేనేజర్ పి. జగదీష్ బాబు విజ్ఞప్తి చేశారు.

బుల్లెట్‌రెడ్డి సినిమా సందడి


అర్బన్‌పార్క్‌లో సినిమా షూటింగ్

బోథ్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి):బోథ్ రేంజ్ పరిధిలోని అర్బన్ పార్కులో శుక్రవారం బుల్లెట్‌రెడ్డి సినిమా షూటింగ్ నిర్వహించారు. హీరో, దర్శకుడు, నిర్మాత అయిన ఆదిరెడ్డి హీరోయిన్ అవికతో కలిసి సినిమా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ సినిమా మొత్తం తెలంగాణ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తాను నిజా మాబాద్ జిల్లా బోధన్‌కు చెందినవాడినన్నారు. కనుక ఐదు కోట్ల రూపాయల బడ్జెట్‌తో సినిమాని తెలంగాణ ప్రాంతంలోని పూర్తి చేసి ఉగాదికి విడుదల చేసేందుకు ప్రయత్ని స్తున్నామన్నారు. సినిమా షూటింగ్‌కు అటవి శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు సహ కరించాలని కోరారు. మూడు రోజుల పాటు జలపాతం వద్ద షూటింగ్ పూర్తి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. కాగా షూటింగ్ జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని స్థానికులు అక్కడికి చేరుకున్నారు.

త్వరలో లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం

● సబ్‌స్టేషన్‌లో మరో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ, అధికారులు

బోథ్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతన్నలను లో వోల్టేజి సమస్య వేదిస్తున్నది ఫలితంగా రైతులు పంటలకు నీరు పెట్టాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బోథ్ నుంచి మర్లపల్లి, నిగిని కంటేగా తదితర గ్రామాలకు రైతులకు దాదాపు 16కి.మీలు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం జరిగింది. అయితే బోథ్ నుంచి 16కి.మీ దూరం వరకు ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతున్న వారిని లో వోల్టేజి సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంది. దీంతో రైతుల సమస్యలను పరిశీలించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్నారు. ఫలితంగా రైతుల కష్టాలు త్వరలో దూరం.. త్వరలో లో వోల్టేజి సమస్య తీరుతుంది. ఎస్‌సీసీ బోథ్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులకు విద్యుత్ సమస్య తీరిపోనున్నది. నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్ బిగించగానే రైతుల ఇబ్బందులు తొలగిపోతాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్‌సీ చౌహాన్ పేర్కొన్నారు. శుక్రవారం బోథ్ సబ్‌స్టేషన్ సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్య రాకుండా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రబీ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు తమ శాఖ కృషి చేస్తుందని వివరించారు. కాగా సబ్‌స్టేషన్ సందర్శించిన వారిలో ఇచ్చోడ సబ్ డివిజన్ ఏడీఎం ఆర్‌టీ డీఈఎస్‌ఎల్ ఐ ప్రవీణ్, ఎల్‌ఐ చావ్లా ఉన్నారు.


పత్తి పంట


మార్కెట్‌లో పత్తిని ఆరబెట్టిన రైతులు

- పత్తికి మద్దతు ధరను తగ్గిస్తామంటున్న సీసీఐ
- నాణ్యత పేరిట మద్దతు ధరలో రూ.50 తగ్గింపు
- దిగుబడి అంచనా రూ.30 లక్షలు.. కొన్నది మొత్తం 17,30,235 క్వింటాళ్లు
- నాణ్యత తగ్గిందంటూ సీసీఐ అధికారుల వాదన
- నోరు మెదుపని నేతలు.. పత్తి రైతులకు తీవ్రనష్టం
- ఆందోళనలకు సిద్ధమవుతున్న అన్నదాతలు
- జిల్లాలో ఈయేడు 4.34 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

నాణ్యత పేరిట.. కొర్రీలు

నాణ్యత పేరిట.. పత్తి కొనుగోళ్లకు కొర్రీలు పెట్టేందుకు సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సిద్ధమయ్యింది. ఈనెల 31 నుంచి మద్దతు ధరను తగ్గిస్తూ 8శాతం తేమ ఉన్న పత్తికి రూ.7,471లను చెల్లిస్తామని సీసీఐ ప్రకటించింది. దీంతో జిల్లా రైతుల కు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ సీసీఐ కేంద్రాలలో మద్దతు ధరను తగ్గించడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో సీసీఐ, మార్కెట్ అధికారులతో పాటు ప్రైవేట్ పత్తి వ్యాపారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పత్తి నాణ్యత, వాతావరణ పరిస్థితులు, కొనుగోళ్ల ప్రక్రియపై చర్చించారు.

ఆదిలాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల ప్రారంభమై రెండు మాసాలు గడవక ముందే నాణ్యత తగ్గిందంటూ సీసీఐ ధరల్లో కోతలు విధించడంపై రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈయేడు 4లక్షల 34వేల ఎకరాలలో పత్తి పంట సాగయ్యింది. దీంతో సుమారుగా 30లక్షల క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు సీసీఐ 78,453 మంది రైతుల నుంచి 17లక్షల 30వేల 235 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. అదే ప్రైవేట్ వ్యాపారులు 8,862 మంది రైతుల నుంచి లక్షా 46వేల 741.42 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. దీంతో ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 18లక్షల 76వేల 976 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మార్చి, ఏప్రిల్ వరకు పత్తి కొనుగోళ్లు జరుగుతాయి. కానీ జనవరికి ముందే మద్దతు ధరలో సీసీఐ కోతలు విధించడంతో అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. అంతేకాకుండా సీసీఐ నిబంధనలతో పత్తి రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నా.. రాజకీయ పార్టీలు, నేతలు నోరు మెదపడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


బేల మండలంలో ధర్నా చేస్తున్న పత్తి రైతులు

కొనుగోలు చేసింది సగమే..

జిల్లాలో ఇప్పటి వరకు సగం పత్తి పంట దిగుబడులనే సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగితా సగం పత్తిని అమ్మేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈసారి క్వింటాల్ పత్తి ధర రూ.7,521 కాగా, నాణ్యత లేదంటూ తాజాగా రూ.50 తగ్గించేందుకు సీసీఐ సిద్ధమయ్యింది. దీంతో పత్తి రైతులకు తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటి వరకు సీసీఐ 17లక్షల 30వేల 235 క్వింటాళ్లను కొనుగోలు చేయగా ఇందులో కొద్దిమంది రైతులకే పూర్తిస్థాయిలో మద్దతు ధర దక్కింది. మిగితా రైతులకు అరకొరగానే ధర దక్కినట్లు తెలుస్తుంది. 8శాతం నుంచి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేసింది. ఆపైగా తేమ ఉంటే ప్రైవేట్ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్‌లో క్వింటాల్ పత్తికి రూ.6,900 ధర పలుకుతోంది. పత్తి నాణ్యతా ప్రమాణాలు తగ్గినందున బీబీ మోడ్ నుంచి బీబీ స్పెషల్‌కు మారినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఈనెల 31 నుంచి మద్దతు ధరను తగ్గిస్తూ 8తేమ శాతం ఉన్న పత్తికి రూ.7,471 చెల్లించేందుకు సీసీఐ నిర్ణయించింది. అయితే గత నెలలోనే పత్తిని ఏరి నిల్వ చేసుకున్న రైతులు సీసీఐ నిర్ణయంతో నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. చివరి సమయంలో ధరల్లో పెరుగుదల ఉంటుందని భావించిన రైతులు.. ఇళ్లలోనే భారీగా నిల్వ చేసుకుంటున్నారు. కానీ సమయం గడిచి పోవడంతో నాణ్యత తగ్గిందని అధికారులు చెప్పడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అధిక ధర వస్తుందని ఆశపడి నిల్వ చేస్తే అసలుకే మోసం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.

అంచనాలతో కోతలు

పత్తి దిగుబడుల్లో నాణ్యత లేదంటూ సీసీఐ అధికారులు పేర్కొంటున్నా రు. ఇప్పటికే శ్యాంపుల్ టెస్టింగ్ చేసి నిర్ధారించినట్లు చెబుతున్నారు. ప్రారంభంలో 30ఎంఎం ఆపై ఉన్న పత్తికి రూ.7,521 మద్దతు ధరను చెల్లించారు. ప్రస్తుతం పత్తి పింజా పొడవు 29.01 ఎంఎం నుంచి 29.49 ఎంఎం వరకు ఉంటుందని ఎంఐసీ 3.6నుంచి 4.8 వరకు నమోదు కావడంతో మద్దతు ధరను తగ్గిస్తూ రూ.7,471 చెల్లించేందుకు సీసీఐ సిద్ధమయ్యింది. అయితే ఒక గ్రామంలోనే పత్తి రకాలు, నాణ్యత వివిధ రకాలుగా ఉంటుంది. కానీ మొత్తం మార్కెట్ పరిధిలోని గ్రామాలలో పత్తి నాణ్యత తగ్గిందంటూ అధికారులు ఎలా నిర్ణయిస్తారో? అర్థం కావడం లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు. చాలా గ్రామాలలో ప్రస్తుతం పత్తి ఫస్ట్ పీకింగ్‌లోనే ఉంది. కానీ సీసీఐ అధికారులు మాత్రం థర్డ్ పీకింగ్‌లో ఉన్నట్లు పరిగణిస్తూ ధరను తగ్గించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో ఎక్కువగా సారవంతమైన నల్లరేగడి నేలలే ఉండడంతో పింజా పొడవు నాణ్యతతో ఉంటుందని

(తరువాయి 6వ పేజీలో...)

31నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

జైనథ్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జైనథ్, బేల మార్కెట్ పరిధిలో బేల సబ్‌మార్కెట్ ఆవరణలో ఈనెల 31 నుంచి బేలలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మార్కెట్ కార్యదర్శి కాంబ్లె మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి యొక్క నాణ్యత ప్రమాణాలు తగినందున బీబీ ఎంఓడీ నుంచి బీబీ స్పెషల్‌కు మారిందని ఆయన పేర్కొన్నారు. 8శాతం తేమ శాతంలో పత్తి క్వింటాల్‌కు రూ.7471కి సీసీఐ చెల్లిస్తోందని, ఈ విషయాన్ని జైనథ్ బేల మండలంలోని ఆయా గ్రామాల పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జైనథ్ మార్కెట్ కార్యదర్శి పేర్కొన్నారు.


నేటి నుంచి 31 వరకు గ్రామీణ బ్యాంకు ఆన్‌లైన్ సేవలు రద్దు

ఉట్నూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆర్థిక సేవలు విభాగం వారి ఉత్తర్వులను అనుసరించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సంబంధించిన రాష్ట్రంలోని శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నందున శనివారం నుంచి ఈ నెల 31 వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆన్‌లైన్ సేవలు నిలిచి పోతాయని ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచిమేనేజర్ ముదావత్‌రాజు తెలిపారు. ఆయన హస్నాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఖాతాదారుల సేవ కేంద్రాలు ఈ నెల 31 వరకు అందుబాటులో ఉండవని తెలిపారు. రాష్ట్రంలో జనవరి 1నుంచి గ్రామీణ బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు కామ్రేడ్ బాశెట్టి మాదవరావు విజ్ఞాన కేంద్రంలో ఈ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి లౌకిక ప్రజాస్వామిక పార్టీలు, ప్రజాస్వామిక సంఘాలు కార్మిక, కర్షక, విద్యార్థి యువజన సంఘాలు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో నేరడిగొండ మాజీ సర్పంచ్ మృతి


మాజీ సర్పంచ్ ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి (ఫైల్)

నేరడిగొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ గ్రామ మాజీ సర్పంచ్ ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి(90) శుక్ర వారం అనారోగ్యంతో మృతి చెందారు. అయితే, ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.రు. ఆయన 1983నుంచి 1989 వరకు సర్పంచ్‌గా ఉన్నారు. అలాగే వీడీసీ ఛైర్మన్‌గా 20 సంవత్సరాలు సేవ లు అందించి గ్రామ అభివృద్ధికి పాటు పడ్డారు. ఆయన మృతిపట్ల గ్రామస్థులతో పాటు పలువురు సంతాపం ప్రకటించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు ఆయన సేవలను కొనియాడారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

దేశాన్ని సంస్కరణల వైపు నడిపించిన గొప్ప నేత

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి
- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వేళ ఆర్థిక శాఖ మంత్రిగా తనదైన శైలిలో పలు సంస్కరణలు ప్రవేశపెట్టిన మహనీయుడు మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజాసేవ భవన్‌లో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిజాయితీకి, నిబద్ధతకు, నిరాడంబరతకు నిలువుటద్దం ఆర్థికవేత్త, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని అన్నారు. దేశాన్ని లైసెన్స్ రాజ్ నుంచి సంస్కరణల వైపు మళ్లించిన గొప్ప నేత అన్నారు. ఆయన అకాల మరణం కాంగ్రెస్‌తో పాటు దేశానికి తీరనిలోటు అన్నారు. తనలాంటి ఎంతో మంది రైతు బిడ్డలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి కారణం ఆయన సంస్కరణలే అన్నారు. ప్రొఫెసర్‌గా, ఎకనామిస్ట్‌గా, రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థికశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం వైస్‌ఛైర్మన్‌గా, యూజీసీ ఛైర్మన్‌గా, దేశ ప్రధానిగా ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి మన్మోహన్‌సింగ్ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు డేరా కృష్ణారెడ్డి, దిగంబర్‌రావు పాటిల్, గుడిపెల్లి నగేష్, గిమ్మ సంతోష్‌రావు, లోక ప్రవీణ్‌రెడ్డి, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, రామ్‌కుమార్, భూమన్న, షకీల్, దుర్గం శేఖర్, మునిగెల నర్సింగ్, మన్సూర్, శ్రీలేఖ, లత, ప్రమీల, శారత, గంగామణి, తదితరులున్నారు.


నివాళ్లు అర్పిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు



ఇరుకు వంతెనలతో ఇబ్బందులు

- ఏజెన్సీలో పలుచోట్ల ఆరు దశాబ్దాల క్రితం నిర్మాణం
- మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు
- భయాందోళనల మధ్య ఆదివాసీ గిరిజనుల రాకపోకలు
- అయినా పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

7లో